# పిచ్చీపిచ్చీ పిల్లంగోర్

అక్కినేని కుటుంబరావు

ఉలిక్కిపడి లేచాడు రాంబాబు.

వంటింట్లోంచి అమ్మ కవ్వంతో చల్లచేస్తున్న చప్పుడు వినబడుతోంది.

రాంబాబుకి తనెందుకు లేచాడో గుర్తొచ్చింది. చేతులవంక చూచుకున్నాడు. ఎండిపోయిన గోరింటాకు చేతులకీ, తను అప్పటివరకూ పడుకుని వున్న పక్కమీదా!

గబగబా వంటింట్లోకి నడిచాడు. అమ్మ చల్ల చెయ్యడం ఆపకుండానే "అప్పుడే లేచావేం! ఇంకాసేపు పడుకోవాన్నా" అంది.

'పడుకోను' అన్నట్టు తల అడ్డంగా ఊపాడు రాంబాబు.

తల ఊపుతూనే అమ్మ దగ్గరకెళ్ళి అమ్మని వెనక నుంచి కావలించుకున్నాడు.

శకుంతలమ్మ చల్లచెయ్యడం ఆపి కొడుకుని ముందుకు తీసుకుని తల నిమిరి, జుట్టు సవరించి, చేతులు చూసి, "తొందరగా చేతులు కడుక్కుని రా! ఎట్టా పండాయో చూద్దాం!" అంది.

రాంబాబు కాసేపు తల్లి దగ్గర మారాంచేసి గబగబా వాకిట్లోకొచ్చాడు. తెల్లగా తెల్లారినట్టుగా వెన్నెల. వాకిలంతా దొడ్డంతానే గాక, సత్తెంగాడిల్లూ, సూరేడిల్లూ, అనసూయిల్లూ, రమా సుజాతల యిళ్ళదాకా అన్ని యిళ్ళూ శుభ్రంగా కన్పడుతున్నాయి.

దొడ్లో తొట్టె దగ్గరున్న బీరచెట్టు పువ్వులు పూసింది. ఆ వెన్నెల్లో బీరపువ్వులు ఎంతందంగానో వున్నాయి. కాస్త దూరంగా సొరచెట్టు నేలమీద చాలా సేపు పాకి గొడ్లపాకమీదికెక్కింది. పాక మీదనుంచి సొర పువ్వులు తెల్లగా, వెన్నెల్లో.

'పుట్టి బుద్దెరిగినాక ఈ బాబు ఎప్పుడన్నా యింత పొద్దున్నే లేచాడా?' అన్నట్టు మరీ తెల్లబోయి ఆశ్చర్యంగా చూస్తున్నాయి సొరపువ్వులు.

రాంబాబు అన్నీ ఓసారి చూసి గబగబా దొడ్లో వున్న తొట్టె దగ్గరకెళ్ళి తొట్లో వున్న చెంబుతో నీళ్ళు తీసుకుని రెండు చేతులూ శుభ్రంగా కడుక్కున్నాడు. వెంటనే చేతులు చొక్కాకీ లాగూకీ తుడుచుకుని ఆ వెన్నెట్లోనే అరచేతుల్ని చూసుకున్నాడు.

గోరింటాకుతో ఎర్రగా పండివున్నాయి ఆ చిన్నారి చేతులు.

బీరపూలు తలలాడించాయి చిరుగాలికి.

గబగబా పరిగెత్తికెళ్ళి అమ్మ మొఖానికి దగ్గరగా చేతులుంచాడు.

శకుంతలమ్మ కొడుకు చేతులు చూసి "అబ్బ! ఎంత బాగా పండాయో! ఈసారి అందరికన్నా నీ చేతులే బాగా పండివుంటాయిలే" అని కొడుకు అరిచేతుల్ని దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంది. కొడుకు కళ్ళలోకి చూస్తూ "వెళ్ళి మొఖం కడిగేసుకుని రా. పులిహోర తిందువుగాని" అంది.

"ఊ...!" అన్నాడు గారంగా రాంబాబు.

"ఊ ఏంటి? నీకిష్టమని గోంగూర పచ్చడికూడా చేశా. పెరుగేసుకుని పులిహోర తిందువుగాని. మళ్ళీ మీ జతగాళ్ళంతా వచ్చేస్తారు" అంది తల్లి.

రాంబాబుకి వెంటనే జ్ఞానోదయమయింది.

రాత్రి తను తన జతగాళ్ళతో అన్న మాటలు జ్ఞాపకమొచ్చాయి. 'అందరికన్నా ముందు నేనే లేచి పులిహోర కూడ తినేసి, 'పిచ్చీపిచ్చీ పిల్లంగోర్' అంటూ మన వీథిలో పిల్లలందర్నీ నేనే లేపుతాను' అన్నాడు రాంబాబు.

ఇవ్వాళ 'తెల్లారగట్ట తద్ది'. పిల్లలంతా దీన్ని 'పిచ్చీపిచ్చీ పిల్లంగోర్ పండగ' అంటారు. తెల్లారకట్టే లేచి పులిహోర తిని వెన్నెల్లో పడి వీథివీథీ తిరుగుతూ 'పిచ్చీ పిచ్చీ పిల్లంగోర్—తెల్లారింది లేవండోయ్' అని అరుస్తూ పిల్లలందర్నీ పోగేసుకుని వెన్నెల పోకుండానే రకరకాల ఆటలాడతారు. రావిచెట్లకి, గంగరావిచెట్లకి వేసిన పెద్ద పెద్ద 'ఉయ్యాల' లూగుతూ చాలా సందడిగా, సంతోషంగా గడుపుతారు పిల్లలు. ఒకరిమీద ఒకరు పోటీలు పడి పెద్దలుకూడా ఉయ్యాలలూగుతారు. ప్రతి వీథిలోనూ రెండు మూడు పెద్ద ఉయ్యాలలుంటాయి. ఆ రోజంతా ఆడ పిల్లలు ఆ ఉయ్యాలలూగుతూనే గడిపేస్తారు.

రాంబాబుకి గుర్తొచ్చింది, తన వీథిలో అందరి కన్నా ముందులేచి తనే అందర్నీ లేపుతానన్న సంగతి.

పరుగుపరుగున మళ్ళీ దొడ్లోకెళ్ళాడు. గబగబా 'కచ్చిక' తీసుకుని పళ్ళు తోముకోడం మొదలెట్టాడు.

దూరంగా ఏదో కేక వినపడ్డట్టయి, చెవులు రిక్కించి విన్నాడు. అతని గుండెల్లో గుబులయ్యింది. 'తన కన్నా ముందే ఏ కిట్టిగాడో లేచి 'పిచ్చీపిచ్చీ పిల్లంగోర్' అంటున్నాడు అని. కాని మళ్ళీ ఏ కేకా వినబడలేదు.

మొఖం కడిగేసుకున్నాడు. చొక్కాకే తుడిచేసుకున్నాడు. వాళ్ళమ్మ ఎన్నిసార్లు తుండుతో తుడుచుకోమన్నా రాంబాబుకి చొక్కాతో తుడుచుకోవడంలోని ఆనందం తుండుతో తుడుచుకుంటే కనబడడంలా. తుండుతో తుడుచుకోవాలీ అంటే ముందు తుండెక్కడుందో చూడాలి. దాన్ని దులపాలి. దానితో తుడుచుకుని, దాన్ని మళ్ళీ ఎక్కడో పడెయ్యాలి. ఇదంతా ఎందుకొచ్చిన గోల... చొక్కాని కాస్త లేపితే అన్ని పనులు చకచకా అయిపోతాయ్... అందుకే చేతుల్ని లాగూకీ, మొఖాన్ని చొక్కాకీ తుడుచుకుని రాంబాబు వంటింట్లోకెళ్ళాడు.

"అమ్మా తొందరగా పెట్టవే. కొంచెమంటే కొంచెం..." అన్నాడు గబగబా.

కొడుకంత తొందరెందుకు పడ్తున్నాడో తెల్సు. నవ్వుకుంటూ పులిహోర గోంగూర పచ్చడితో కొంచెం ఒక పళ్ళెంలోవేసి కలిపి ముద్దలు రాంబాబు నోట్లో పెట్టింది. రాంబాబు ముద్దముద్దకీ నీళ్ళు తాగుతూ... ఇలా నీళ్ళుతాగకూడదని తల్లి చెప్పినా 'తొందర పనులున్నప్పుడు' రాంబాబు యిలానే చేస్తాడు. ముద్ద నోట్లో పడగానే నీళ్ళు తాగితే అన్నమంతా నమలక్కర్లా! మింగేయొచ్చు.

త్వరత్వరగా తిండికార్యక్రమం ముగించబోయాడు.

"అరె! పెరుగుతో కూడా రెండు ముద్దలు తిను నాన్నా" అని శకుంతలమ్మ కొడుకుని పట్టుకుని కూర్చోబెట్టి, వేరే తీసిపెట్టిన మీగడపెరుగుతీసి కలిపి కొడుక్కి పెట్టింది.

రాంబాబు యింకో ముద్ద వుండగానే లేచి పరుగు తీసేవాడి వరసలోకొచ్చేశాడు. శకుంతలమ్మ కూడా లేచి వాడితోపాటే వాడిచొక్కా పుచ్చుకుని ఆపి ఆ చివరి ముద్ద వాడినోట్లో పెట్టి, గ్లాసు నీళ్ళిచ్చి, వాడి మూతి తుడిచింది. మొకమూ చేతులూ కడుక్కున్నప్పుడు లాగూకీ చొక్కాకీ తుడవకూడదని కొడుక్కి చాలా సార్లే చెప్తుంది శకుంతలమ్మ. కాని తన చేతుల్ని చీరకే తుడుచుకోవడం ఎప్పుడూ మర్చిపోలేదు.

రాంబాబు దూసుకుని వీథిలోకి పోయాడు. పోతూనే "పిచ్చీ పిచ్చీ పిల్లంగోర్. తెల్లారింది లేవండోయ్" అని కేక వేశాడు. అప్పుడుగాని మనసు కుదుటపడలే. ఇతను రెండు కేకలేసేసరికే రెండిళ్ళవతల్నుంచి చిట్టిగాడొచ్చాడు. ఇద్దరూ కలిసి రెండు కేకలేసేసరికి మూడిళ్ళవతల్నుంచి కిట్టిగాడూ, చంటిగాడు... అలాఅలా ఆ వీథి పిల్లలంతా మొత్తం పోగయ్యారు. అందరూ కలిసి వీథిలో రెండు మూడు సార్లు అటూ ఇటూ తిరిగారు. తర్వాత ప్రక్క వీథికెళ్ళి అక్కడివార్ని కలుపుకున్నారు. అంతా కల్సి పాతికమంది దాకా పోగయ్యారు. ఎవరి చేతులు బాగా పండినయ్యో, ఎవరెవరు ఏమేమి తిన్నారో, రాత్రి ఏమేమి ఆటలాడ్తూ వాళ్ళమ్మ పిలుపులకో, నాన్న తిట్లకో జడిసి, మధ్య వెళ్ళిపోయారో మాట్లాడు




కుంటూ... వెన్నెల్లో తడుస్తూ... ఇప్పుడు ఏం ఆడాలనే చర్చలోకొచ్చారు.

'కుందుకుట్టాట' అన్నాడు చిట్టిగాడు. వాడు బాగా కుందుకుట్టాట ఆడతాడు.

చంటిగాడు 'ఆకాట' అన్నాడు. ఏ ఆకుతెమ్మన్నా చిటికెలో తేగల ప్రావీణ్యం వాడు సంపాదించాడు.

కాసేపు అదీ ఇదీ తర్జన భర్జనలయ్యాక, ముందు వెన్నెల పోకుండా 'వెన్నెల నీడ' ఆడడానికి ఎక్కువ మంది మొగ్గారు.

వెన్నెలనీడ ఆడుతూ ఆడుతూ 'దొంగాట' మొదలెట్టారు.

కిట్టిగాడు దొంగయ్యాడు.

రాంబాబు, చిట్టిగాడూ, చంటిగాడూ, సత్తెంగాడూ, సూరీడూ అందరూ కోదండరామయ్యగారి గొడ్ల చావిట్లో దూరారు. చావడి బైట పట్టపగల్లా వెన్నెల కాస్తోంది. మూడు వైపులా తాటాకుల్తో దడికట్టి వుండడంవల్ల లోపల గాఢాంధకారంగా వుంది.

వీళ్ళు చావిట్లోకెళ్తానేగొడ్లమేతకోసమున్న 'గాడి'లో కెళ్ళారు. కాని ఎవరికి వారికి ఎందుకో ఎన్నడూ లేనిది భయమేసింది. లేచి చావిట్లో పరుగులుతీసి ఎలిసి ఎక్క బోయి మరీ భయమన్పించి బైటవున్న పెద్దపురి చాటున నిలబడ్డారు. పెద్దపెద్ద రాళ్ళమీద బండిచక్రం వేసి దానిమీద కట్టారు పురిని, ఎలకల బారినుంచి కాపాడ్డానికి.

కిట్టిగాడొస్తున్నట్టు కేక లిన్పడ్తున్నాయ్. వాడెటొచ్చి పట్టేసుకుంటాడోనని వీళ్ళు పురిచుట్టూ తిరుగుతుంటే వీళ్ళముందో వెనకో ఎవరో తిరుగుతున్నట్టుగా అన్పించి బాగా బెదిరిపోయారు పిల్లలంతా.

రాంబాబూ, చిట్టిగాడూ కళ్ళు చిన్నవిచేసితలలెగరేసి ఏమిటన్నట్టుగా వకర్నొకరు ప్రశ్నించుకున్నారు.

అప్పుడు రాంబాబు చెప్పాడు అయిడియా. అంతా కళ్ళతోనూ, చేతుల్తోనే. చిట్టిగాడూ మరో ముగ్గురు వెనక్కి తిరిగి పురిచుట్టూ తిరుగుతారు. రాంబాబు మరో నల్గురూ ముందునుంచీపురిచుట్టూ తిరుగుతారు.

తిరిగారు.

ఆశ్చర్యంగానూ, భయంగానూ వుంది.

ఖంగారుగా వకతను పురికిందకి దూరిపోయాడు.

పిల్లలంతా వక్కసారిగా 'దొంగ' 'దొంగ' అని అరవడం మొదలెట్టారు.

'పిల్లల్లో దొంగ' కాదనీ, 'ఆటదొంగ' అసలేకాదనీ, నిజమైన దొంగని, పిల్లలు పట్టుకున్నారనీ పెద్దలకు తెలిసే సరికి తెల్లగా తెల్లారిపోయింది.

** ** ** ** **

కోదండయ్యగారిది చాలా పెద్ద దొడ్డి. ఊరు సగం అక్కడే వుంది.

'దొంగ'ని బండి చక్రానికి కట్టేశారు.

గోవిందయ్యగారొచ్చాడు.

పట్టాభిరామయ్య రానేవచ్చాడు.

నల్లాడు మొదట్నుంచీ అక్కడే వున్నాడు.

తాటాకు దడి అడ్డంగా ఆడవాళ్ళుకూడా చాలా మంది వచ్చేసివున్నారు.

ఇప్పుడు సూర్యనారాయణగారు కూడా వచ్చేశాడు. వస్తూనే అక్కడున్న అందర్నీ, వాతావరణాన్నీ, దడవ తలగా వున్న ఆడవాళ్ళనీ... వారి గుసగుసల్ని పట్టి వాళ్ళంతా అక్కడున్నారని... కోదండయ్యగారి దొడ్డినీ, గొడ్ల చావడినీ, కట్టు గొయ్యలకి కట్టేసివున్న గొడ్లనీ చూశాడు.

"ఏం బావా! కొత్త గిత్తలు కన్పడ్తున్నాయ్" అన్నాడు.

"నిన్న సందేళ మా బామ్మర్ది శికివాల నుంచి తోలుకొచ్చాడు బావా! నీక్కాబురంపితే నువ్వు లేవు. పాల మెళ్ళావన్నారు. ఇదిగో ఇవాళ యిదీ వరస..." అన్నాడు కోదండయ్యగారు.

సూర్యనారాయణ మంచి 'హుందా' అయిన మనిషి. అందుకే అక్కడున్న యావన్మందినీ, బండికికట్టివున్న మనిషినీ, దడవతలున్న 'ఆడంగుల్నీ' అందర్నీ విస్మరించి గిత్తలదగ్గరకెళ్ళాడు.

ఒక గిత్త పిర్రమీద ఒక దెబ్బ వేశాడు. ఆ దెబ్బ మోతకి అక్కడున్నవాళ్ళంతా అదిరి పడ్డారు. గిత్త సరేసరి. అది గిరుక్కున వెనక్కి తిరిగిసూర్యనారాయణ్ని కూడా పరామర్శించబోయింది. అప్పటికేదానికందనంత యివతలకొచ్చి "భేష్. మంచి ఫలాకీ జోడులే. బాగుంది" అన్నాడు.

అప్పుడు మళ్ళీ అందరివంకా చూశాడు. ఆయనకి వెండితీగల మీసకట్టు పెద్దదే వుంది. అది అంత పెద్దగా వుందికాబట్టే, మీసాన్ని ఓసారి సవరించుకుని—

"ఊ..." అన్నాడు.

రెండు గంటలపాటు అవతలవాళ్ళు చెప్పగా చెప్పగా వినివినీ అలిసిపోయినట్టున్న "ఊ" అది.

"ఊ..." అంటూనే అందర్నీ వదిలి బండిదగ్గరగా వెళ్తూ "నీ పేరేంట్రా అబ్బాయ్" అన్నాడు.

ఆ అబ్బాయ్ పేరు చెప్పే టైంకూడా యివ్వకుండానే—

"ఏ ఊరు?" అన్నాడు.

దానికీ జవాబిచ్చే వ్యవధినివ్వకుండానే పిల్లల్నుద్దేశించి "మీరంతా ఎందుకురా యిక్కడ? పిల్లంగోర్ పండుగాయే! పోయాదుకోండి! ఎందుకిక్కడ?" అని కసురుకుని—

"అడిగిందానికి జవాబు చెప్పవేరా?" అన్నాడు. అంటూనే ఎందుకోవంగుతున్నట్టు వంగుని చెప్ప తీసుకుని అతనిమీద పడి చెడామడా వేళ్చేళ్చ నాలుగు సార్లు ఆ దవడా ఈ దవడా పగిలిపోయేట్టు కొట్టాడు.

దడవతల ఆడవాళ్ళు తలలన్నీ దడిమీదగాపెట్టి బిక్క చచ్చిపోయి చూస్తున్నారు.

పిల్లలంతా ఊపిరందనంతగా భయపడిపోయారు. దొడ్లోనే ఉన్న వేపచెట్టుమీదున్న పక్షులు ఒక్కసారిగా రెక్కలు కొట్టుకుంటూ రకరకాల కూతలతో ఎగిరిపోయాయ్. చావిట్లో పశువులన్నీ వెనక్కితిరిగి ఆశ్చర్యంగా చూస్తున్నాయ్.

"చెప్పు" అని ఓ భయంకరమైన రంకె వేశాడు సూర్యనారాయణ.

అప్పటివరకూ అక్కడక్కడ నుంచుని ఉన్న పెద్ద మనుషులంతా సూర్యనారాయణదగ్గరకొచ్చి చుట్టూ




నుంచున్నారు.

సూర్యనారాయణ అతనివైపు కోపంగా చూడడం చాలించి, నెమ్మదిగా చూస్తూ "చెప్పు. నీ పేరేంటి?" అన్నాడు.

"నా పేరు సత్యం. మాది..." అని అనుమానంగా ఆగిపోయాడు సత్యం.

"మా ఊరే" అంటూ అంతమంది మధ్యలోకీ వచ్చేసింది సత్యవతమ్మ.

అప్పుడు ఆ ఊరి వారందరిమీద ఆకాశమే విరిగి పడింది.

ఆ ఊరి చరిత్రలో దడో, తలుపో, గోడో అడ్డం లేకుండా ఒక 'ఆడది' మగాడిముందు పడడం అనేది లేదు. ఇక్కడ ఒక మగాడుగాదు. ఊరి 'మొవాసు' అంతా వున్నారు. పైగా ఒక దొంగని వెనకేసుకుని...

అందరికీ అర్థమైంది. అతను మామూలు దొంగ కాదు. అతనొచ్చింది మామూలు దొంగతనం కోసం కాదు.

"ఆ ఊరి పరువు ప్రతిష్టల్ని దోచెయ్యడానికి."

"ఆ ఊరి మానాభిమానాలు మంటగలపడానికి."

"ఆ ఊరి ఆడవాళ్ళందరికీ మాయని మచ్చ తేడానికి."

ముందు తేరుకున్న సూర్యనారాయణ "మంగలి కోటప్పని వెంటనే తీసుకురండి. ఇక్కడున్నట్టురావాలి" అన్నాడు.

నల్లాడు వెంటనే బైల్దేరాడు.

"వాడు చేతులూపుకుంటూ వస్తాడేమో! వాడి పెట్టి తెచ్చుకోమను."

సూర్యనారాయణ సత్యంవంక తిరిగాడు. సత్యం ఏదో చెప్పబోతున్నాడు. ఏం చెప్తాడో విందామని ఊరంతా సద్దుమణిగింది. సూర్యనారాయణ తలకాస్త పైకిలేపాడు. చెయ్యి సత్యం మొఖంవేపుకి లేపి చూపుడు వేలుతో బెదిరిస్తూ, "మాట్లాడమాక" అన్నాడు.

అతను మళ్ళీ ఏదో అనబోతే...

"బతికుండాలనుంటే వచ్చినట్టు పడుండు" అన్నాడు.

అతనికి బతికుండాలని లేదేమో. అవును వచ్చినట్టు పడి బతికుండాలని లేదు. "ఇది ఊరా? వల్లకాడా?" అన్నాడు. "నేను చెప్పేది వినండి" అని కూడా అన్నాడు.

"సరే సరే. చెప్పనివ్వండి బావగారూ. ఏం చెప్తాడో అదీ విందాం" అన్నాడు పట్టాభిరామయ్య.

సత్యం చెప్పడం మొదలెట్టాడు.

సత్యమూ సత్యవతీ చిన్న తనమంతా కలిసి ఆట పాటల్తో గడిపారు. కాస్త ఎదిగాక కల్సి బడికి వెళ్ళారు. వస్తూనే కల్సికూర్చుని చదువుకున్నారు. క్లాసు పుస్తకాలూ తర్వాత తర్వాత చందమామలూ, బాల మిత్రలూ. కల్సే లెక్కల్తో కుస్తీలు పట్టారు. కరివేపాకు తేవడం నుంచి కారానిక్కాపలావరకూ కల్సే చేసేవాళ్ళు. ఇంకాస్త పెరిగాక కల్సి కలలుకన్నారు.

కాని— కలలన్నీ కల్లలయ్యాయి. ఈ ఊరతన్తో బలవంతంగా పెళ్ళి జరిపించాడు సత్యవతి తండ్రి.

సత్యానికి మనసు దేనిమీదా నిలవక, ఏ పనీచెయ్యలేక, ఊళ్ళుబట్టిపోయాడు.

ఎక్కడో ఎవరో కనబడి చెప్పారు. 'నీకు తెలుసా? మీ సత్యవతి భర్త పోయాడు' అని.

ఆమెని ఓదార్చాలని అప్పటికప్పుడు బైల్దేరి వచ్చాడు సత్యం. వచ్చాక చూసి, మాట్లాడాక సత్యాని కన్పించింది—ఇంతకు ముందు సత్యవతికి తన అవసరం వున్నా లేక పోయినా యిప్పుడు తప్పక తనఅండకావాలి. తామిద్దరూ కల్సి బతకాలి.

ఇంతవరకూ చెప్పి సత్యం అన్నాడు.

"మీ కెవరికీ కష్టం కల్గకుండా నే నీమెని మీ ముందే పెళ్ళి చేసుకుని తీసికెళ్తాను."

ఆ బండికి కట్టివెయ్యబడివున్న వాడు మామూలు దొంగ కాదని అంతకు ముందే తెలిసినా యిప్పుడు అతను తమలాంటి మామూలు మనిషికూడా కాదని, ఈ ఊరికే గాక మొత్తం మానవ సమాజానికే చీడపురుగనీ అభిప్రాయపడ్డారు అక్కడున్న పెద్దలు.

గోవిందయ్య తల్లో మెరుపుమెరిసింది. "అయితే, నీ పేరేంటో..." అన్నాడు.

ఎవరో "సత్యం" అని అందిచ్చారు.

"అదేలే—అయితే సత్యమూ నువ్వు ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానంటున్నావు. మరి గేదెల దొడ్డోనూ, పురికిందా ఎందుకు తారట్లాడతన్నావూ?" అన్నాడు.

ఊరందరూ ఎంత అద్భుతమైన పాయింట్లు మర్చిపోయామోగదా అని చాలా విచారపడ్డారు.

సత్యం అన్నాడు "అది నిజంగా పొరపాటే. కాని ఏం చెయ్యను. సత్యవతి ఎవరన్నా చూస్తారని బాగా భయపడింది. భయపడక్కర్లేదన్నా వినలా. తెల్లారేవరకూ వుండి వాళ్ళ అత్తమామల్తో మాట్లాడతానన్నా విన్లా. అంతలో పిల్లల కేకలు విని నన్ను పారిపొమ్మనీ లేపోతే తాను అల్లరి అయిపోతాననీ ఏడవడం మొదలెట్టింది. గత్యంతరం లేక పిల్లల్ని తప్పించుకోడానికి నేను ఆ చావిట్లో కెళ్తే వాళ్ళు అటే వచ్చారు. నేను కంగారుపడి కింద దూరాను. అదంతా చాలా అనాలోచితంగా చేశాను"

మంగలి కోటప్ప వచ్చి వున్నాడు.

సూర్యనారాయణన్నాడు–"చెప్పినంతవరకూ 'అరి కత' బాగానే వుందిగానీ యికసరిపెట్టు... ఉరే కోటప్పా యిదిగో ఈడి తల గొరుగు" అన్నాడు

"ఏమిటీ అన్యాయం. ఇది ఊరేనా?" అన్నాడు సత్యం ఆవేశంగా.

"ఊరు కాబట్టే" అన్నాడు సూర్యనారాయణ శాంతంగా. అని "మాత్తావేంటిరా" అని కోటప్పవంక ఉరిమి చూశాడు.

కోటప్ప గబగబా సత్యం దగ్గరకెళ్ళి "కదలమాక బాబో! కదిలితే గాయమవుతుంది" అని సత్యం తలపట్టుకుని వెంట్రుకలన్నీ పూర్తిగా తీసేశాడు.

"దీనిక్కూడా గుండుగొరుగు" అన్నాడు సూర్య నారాయణ.

ఆడవాళ్ళంతా మళ్ళీ రకరకాల గుసగుసల్లో పడ్డారు.

సత్యవతమ్మ వచ్చిన తలవంచుకుని సత్యం పాదాల దగ్గర కూర్చుండిపోయింది.

"దీనికసలు ఆ కావుడు పోయినప్పుడే గుండు కొట్టించాల్సింది" అన్నాడు నల్లాడు.

నల్లాడి కసి యిప్పటికి తీరుతోంది. నల్లాడు సత్యవతమ్మని భర్తపోయిన పదిహేనోరోజునుంచీ కారాడుత్తన్నాడు. సత్యవతమ్మ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని తప్పించుకుంటూ వుంది.

ఊళ్ళో ఎవరన్నా అనాథలున్నారంటేవాళ్ళకి నల్లాడు నాథుడవ్వాల్సిందే. వెనకబడిన కులాల, మతాల ఆడవాళ్ళనీ, ఆర్థికంగా చితికిన సంసారాల్లో వున్న ఆడవాళ్ళనీ, భర్తలు పోయిన ఆడవాళ్ళనీ, చెండుకుతినడంలో గణుతికెక్కినవాడు నల్లాడు. ఈ నల్లాడు సత్యవతమ్మని ఎంత వేధిస్తున్నాడంటే, సత్యవతమ్మ వీడి పోరు పడలేక రెండుసార్లు చచ్చిపోదామని కూడా ప్రయత్నించింది.

"బాగా చెప్పావ్" అన్నాడు గోవిందయ్య.

గోవిందయ్య ఆ ఊళ్ళో ఎంతమంది "మొగుళ్ళ" చేతుల్లో చావుదెబ్బతిన్నాడో లెక్కలేదు.

## స్త్రీల ఆధిక్యత

బాన్: పశ్చిమ జర్మనీ జనాభాలో సగానికి పైగా స్త్రీలే. అందువలన ఎన్నికలలో వారు నిర్దిష్టమైన పాత్ర వహిస్తారు. సోషల్ డెమొక్రటిక్ పార్టీలోని మహిళా సభ్యులు ఇటీవల పార్టీలోని పదవులను 25 శాతం స్త్రీలకే ప్రత్యేకించాలని కోరారు. ప్రస్తుతం పదిశాతం పదవులు మాత్రమే స్త్రీలకు కేటాయించ బడ్డాయి. అంతేగాదు త్వరలో స్త్రీలకు కేటాయించిన పదవులను 50 శాతానికి పెంచాలని కూడా వీరు అడగనున్నారు. పార్లమెంటులో కూడా స్త్రీలకు కేటాయించబడిన స్థానాలను పెంచాలని కూడా వీరు వాదిస్తున్నారు. ఓటర్లలో సగానికి పైగా ఉన్న స్త్రీల మద్దత్తు తమకు ఉన్నదని వారు తెలియ చేశారు. (గ్లోబల్)

సత్యవతమ్మకి 'గుండు' చెయ్యడానికి కోటప్ప మన సంగీకరించలేదు.


"చూత్తావేరా" అన్నాడు పట్టాభిరామయ్య. పట్టాభిరామయ్యకి కోడల్తో అక్రమ సంబంధం వున్న విషయం కొడుకుతో సహా అందరికీ తెల్సు. ఇప్పుడు పట్టాభిరామయ్య భుజంమీదవున్న మనమడు, మనమడుకాదనీ చిన్నకొడుకనే విషయం కూడా చాలా మందికి తెలుసు. ఆ చాలామందిలో కొడుకు కూడా వున్నాడు.

కోటప్ప కత్తి సత్యవతమ్మ నెత్తిమీద పెట్టాడు. అతని చెయ్యి వణికింది. సత్యవతమ్మ తలమీద చిన్న గాటు పడింది. ఆవిడ మంచితనం, ఆవిడ పాతివ్రత్యం, ఆవిడ సౌశీల్యం అన్నీ కోటప్పకి తెలుసు. 'ఈ ఊరిలో వేళ్ళమీద లెక్కించవలసిన ఆడవారిలో సత్యవతమ్మ మొదటి శ్రేణిలోకొస్తుంది. అంత మంచావిడకీ గతా?' అనుకుంటున్నాడు కోటప్ప.

'తప్పు చేసినందుకు అలా గుళ్ళు గియ్యవల్సివస్తే ఇక్కడున్నవారిలో ఒక్కరికి కూడా నెత్తిమీద జుట్టు వుండదు' అనుకున్నాడు కోటప్ప. ఊరివారి రహస్యాలన్నీ బహిరంగ రహస్యాలే. 'బహుశా సూర్యనారాయణ ఒక్కడే రెండో ఆడమనిషి నెరగడు' అనుకున్నాడు కోటప్ప.

కాని కోటప్పకి తెలవని సంగతొకటుంది.

భార్య కాంతమ్మకి నూటయిదు డిగ్రీల జ్వరమొచ్చినా సూర్యనారాయణ పక్కమీంచి ఆవిడకి విముక్తి



లభించదు. కటిక లంఖణాల్లో వున్నా కాంతమ్మ 'శయవేషు రంభ'లా వుండాల్సిందే. మంత్రి పదవీ, తల్లి పదవీ ఏమీ లేవు. రంభ, దాసీ. ఈ రెండు పదవులూ ఏ నిమిషమూ ఎన్ని యిబ్బందుల్లోనూ ఏమరకుండా నిర్వహించాల్సిందే.

అదీగాక అసలు సూర్యనారాయణకి వేరేఆడవాళ్ళతో సంబంధాలు పెట్టుకోవాలంటే రెండు రకాల భయాలున్నాయి. ఒకటి డబ్బు— డబ్బు పోతుందేమోనని. రెండు జబ్బు — జబ్బులొస్తాయేమోనని.

ఈ కారణాలవల్ల ఈ ఊరి జనాల్లో సూర్యనారాయణ పెద్ద పవిత్రుడుగా పేరుపొందాడు.

కోటప్ప రెండు మూడు చోట్ల చిన్న చిన్న గంట్లు పెట్టి "ఇక సాల్లే దొరా!" అన్నాడు.

దొరలెవరూ మాట్లాడక ముందే దడవతలనుంచి పట్టాభిరామయ్య బహిరంగ కోడలూ, బహిరంగ రహస్య ప్రియురాలు అయిన సావిత్రి మాత్రం తనకు చాలా అన్యాయం జరుగుతున్నట్టుగా లబలబలాడి "ఊరు పరువు తీసేసింది. 'ఫలానా ఊళ్ళో....'అంటారు గామాల్లు" అని తీగలు తీసింది.

'అవున్లే. ఇంత తెలివితక్కువగా ఉంటారా ఎవరన్నా? నువ్వుసూడు. మామకి పిల్లడ్నికని కూడా ఒక్క మాట అన్పించుకోకుండా ఎలా వున్నావో!' అనుకున్నాడు కోటప్ప.

'ఓసి నీయమ్మ. నీ సంగత్తెలవం దెవడికే' అనుకున్నాడు అక్కడున్న ప్రతి మగవాడు.

మామ ధూర్తత్వమూ, భర్త అలసత్వమూ సావిత్రి నలా తయారుచేసినప్పటికీ వాళ్ళిద్దరికన్నా సావిత్రినే జనం అవహేళనగా అనుకుంటున్నారు.

అసల్సంగతేమిటంటే సత్యవతమ్మగానీ, ఆమె మామగారిగ్గానీ పైసా ఆస్తి లేదు. కూలీ మీద ఆధారపడి బతుకుతున్న గొప్పకులంవాళ్ళు వీళ్ళు. డబ్బుంటే ఆ సంగతి వేరు. అవినీతుల్ని కూడా అవే నీతుల్లా చెలామణి చెయ్యగల సత్తా డబ్బు కుంది మరి. పట్టాభిరామయ్యా సావిత్రిల విషయం అక్కడున్న అందరికీ తెల్సినా, పట్టాభి రామయ్యకిష్టం కాకుండా కోటప్ప ఆయన తల మీద ఒక్క వెంట్రుకని కూడా తియ్యలేడుగా!

సత్యవతమ్మ మామ — ముసలాయన — పక్కవాళ్ళతో అంటున్నాడు–"ఇక చాల్లే ఊరుకోంగి వదిలెయ్యండి, ఆళ్ళ తిప్పలు ఆళ్ళు పడతారులే" అని.

ఆ మాట పదిమంది చెవుల్లోనూ పడకుండానే సత్యవతమ్మ 'బావగారు' తండ్రిని కాల్చేసేట్టు చూసి "నోర్మూసుకో ముసలాడా! మతిచెడిందనుకుంటారు" అన్నాడు.

"చూత్తావేరా! జానిగ్గాడ్ని పిల్చి నీగ్గుండు కొట్టించమంటావేంటి?" అన్నాడు పట్టాభిరామయ్య.

సగం మంది నవ్వారు. మిగిల్న సగం కోప్పడ్డారు.

వణుకుతున్న చేతుల్తోకోటప్ప సత్యవతమ్మ జుట్టంతా తీసేశాడు.

వల్లాడు సున్నం తెచ్చి యిద్దరి తలలమిదా సున్నం బొట్లు పెట్టాడు.

పిల్లలంతా ఏం జరుగుతుందో చూడ్డమే తప్ప ఎందుకు జరుగుతోందో తెలియని అయోమయంలో వున్నారు.

గోవిందయ్యన్నాడు పిల్లల్తో —"అరేయ్ ఈళ్ళి ద్దర్నీ రాళ్ళతో గెడ్డల్తో కొట్టుకుంటూ ఊరవతలకి తరిమిరండిరా!"

ఒకళ్ళిద్దరు పిల్లలు నెమ్మదిగా అక్కడ్నుంచి వెళ్ళిపోయారు కొందరు మనుషుల్లాగే.

పెద్దా చిన్నా గాని 'కోతిగాడు' మాత్రం వాళ్ళ మీద ఒకరాయి వేశాడు. పెద్దలంతా సభ చాలించి లేచారు.

వాళ్ళిద్దరూ తలలొంచుకుని బజారులో నడుస్తున్నారు. కోతిగాడూ, పరివారమూ వుండుండి ఒకటీ రెండు రాళ్ళూ, గడ్డలూ వేస్తూ వెంబడించారు.

నెమ్మదిగా పిల్లలకి ఉత్సాహం వచ్చింది వాళ్ళు ఏమీ అనకుండా తలలొంచుకు నడుస్తూంటే —

ఇద్దరూ వంచిన తల లెత్తలా!

ఊరు మూర్ఖత్వానికి సిగ్గుపడా?

ప్రజల పశుత్వానికి విస్తుపడా?

దుర్మార్గానికి మౌనం పాటిస్తూ — వాళ్ళిద్దరూ శ్మశానాల్లోంచీ అలానే తలలొంచుకుని వెళ్ళిపోయారు.

** ** ** ** **

ఇప్పుడు... ముప్పై సంవత్సరాల తర్వాత కూడా రాంబాబుకదంతా గుర్తొచ్చింది. సిగ్గుతో, దుఃఖంతో, అవమానంతో, అతనికదంతా మళ్ళీమళ్ళీ గుర్తొస్తోంది.

ఇతనూ అప్పుడు ఆ రాళ్ళతో కొట్టిన పిల్లల్తో నడిచాడు.

'తనెందుకుండాలి వాళ్ళతో?

'తనకప్పుడు ఏడెనిమిదేళ్ళుంటాయేమో! తనంతవాడే కదూ చిట్టిగాడు! వాడు తమతో రాకుండా యింటికెళ్ళిపోయాడు. ఆ మాత్రం సంస్కారం తన కెందుకు లేకపోవాలి?

తమ చేసిన పాపానికి పరిహారంగా, ప్రాయశ్చిత్తంగా తను ఏం చెయ్యాలి? వాళ్ళలాంటి ప్రేమికుల్ని ఎటువంటి కష్టాల్లోవున్నా ఆదుకోవాలి. ఆదరించాలి. అభిమానించాలి. ఆలోచిస్తున్నాడు రాంబాబు.

సరే. అసలిప్పుడు వాళ్ళెక్కడున్నారు?'

వాళ్ళు ఆ తర్వాత చాలా అన్యోన్యంగా ప్రేమతో జీవితం గడిపివుంటారని కాసేపు కలలు కన్నాడు.

'లేదా, ప్రేమ మామూలైపోయి మామూలు భార్యాభర్తల్లా చికాకుల్తో, చీదరల్తో, ఒకర్నొకరు హింసించుకుంటూ బతుకుతుంటారా!'అని దిగులుపడ్డాడు.

'లేదా అంతకన్నా హీనంగా, ఘోరంగా ఆమెని అతను మోసం చేసో లేదా ఆమే అతన్ని మోసం చేసో...

ఎలానన్నా వుండనీ,

వాళ్ళకి ప్రేమ తెలుసు.

'వలపెరుంగక బ్రతకొట కన్నా వలచివిఫలమ్మొంది విలపింప మేలురా'

ఏ ప్రేమా లేకుండా మెకానికల్‌గా బ్రతికే మామూలు భార్యాభర్తల్లా కాక ఖచ్చితంగా కొంత భిన్నంగా బ్రతుకుతుంటారు!'అని నిశ్చయంగా అనుకున్నాడు.

పాపం రాంబాబుకి తెలియదు—

"దీన్నిలవమానంగాతీసుకోనక్కర్లేదని, మూర్ఖులు అమానుషంగా ప్రవర్తిస్తే వాళ్ళని చూసి జాలిపడాలిగాని, మనల్ని మనం శిక్షించుకోనవసరం లేదనీ" ఎంత చెప్పినా వినని సత్యవతికోసం—

"కుళ్ళిన సంఘ నియమాల్ని ధిక్కరించి ధైర్యంగా నిలబడి సుఖంగా ఆనందంగా జీవిద్దామ"ని ఎంత చెప్పినా అర్థంచేసుకోలేక పోయిన, హృదయం గాయపడి విలవిల్లాడిపోయిన సత్యవతి కోసం—

"చచ్చిపోవాల్సిన అవసరం ఎంత మాత్రం లేద"ని ఎంత చెప్పినా వినని సత్యవతి కోసం—

సత్యమూ ఆమెతో కల్సి క్రిష్ణలో కలిశాడని –

పాపం రాంబాబుకి తెలియదు. ●